# శ్వేతసౌధం



‘ఆంధ్రప్రభ’ దినపత్రిక ‘ఆదివారం అనుబంధం’ . . . 1 మే, 2005

ఆనాడు జోగారావు అన్నమాటలు నాకు ఎప్పటికీ మరపురావు.

మరువపు పరిమళంలా నా బుఱ్ఱను, మనసును తాకి ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. 'ఏదోలే..!' అనుకొని ఒకప్పుడు తేలికగా వాటిని కొట్టిపడేశాను. తీరా కుదురుగా కూర్చొని ఆలోచిస్తే 'చేసి తీరాల్సిందే!' అనిపిస్తోంది. వాటన్నిటినీ మించి- జోగారావు అప్పట్లో నాకు ప్రాణస్నేహితుడు. వాడి మాటలు నాకు వేదవాక్కు. ఓ మనిషి మీద ఓ మనిషికి అభిమానం, నమ్మకం సాధారణంగా స్నేహాన్ని దృఢతరం చేస్తాయి. అలాంటి అభిమానమే నన్ను వాడికి మరింత దగ్గర చేసింది. నాకు ఏ చిన్నపని కావాలన్నా వాడి సలహా తీసుకొనేవాడిని. అది నా సెంటిమెంట్ కూడా. ఇక నాతో నలభై ఏళ్లుగా జీవితాన్ని పంచుకుంటూన్న భాగ్యానికైతే మరీనూ!

"బాబిగాడి అక్షరాభ్యాసానికి జోగులన్నయ్యగారితో ముహూర్తం పెట్టించుకుర'మ్మని పోరేది.

"నేనేం ముహూర్తాలు పెట్టే పంతుల్ని కాదు లేవోయ్!" అంటూ తేలిగ్గా తీసిపడేసేవాడు.

"మీ చెల్లాయి పెట్టించుకు రమ్మంది- తర్వాత నీ ఇష్టం!" అనేవాణ్ని అందమైన నిష్ఠూరంతో.

ఇక తప్పేదేముంది? జోగారావు పెట్టిన ముహూర్తానికి బాబిగాడికి అక్షరాభ్యాసం జరిగిపోయింది. తర్వాత రాసిన ప్రతి పరీక్షలోనూ బాబిగాడికి అన్నేసి మార్కులు వస్తుంటే నాకే ఆశ్చర్యమేసేది.

"కాఫీ ఇస్తుంటే తీసుకోక ఏమిటా పరధ్యానం?"

– భాగ్యం మాటలకి నా దృష్టి అటు మళ్లింది.

రైలు వేగం పెరిగినట్లుంది... ఆ చిన్న వైబ్రేషన్‌కే డిస్పోజబుల్ కాఫీగ్లాసు వణుకుతోంది. పావుగంట క్రితం ఈ ట్రెయిన్ స్పీడు తక్కువ, కుదుపు ఎక్కువగా అన్పించింది- ఎందుకూ కొరగాని ఓ అయ్యగారి ప్రవర్తనలా... ఇప్పుడు గణనీయమైన మార్పు కన్పిస్తోంది.

"ఏమి నిర్ణయం తీసుకోబోతున్నారు?" తాను కూడా కాఫీని చప్పరిస్తూ అడిగింది భాగ్యం.

మాట రావడం లేదు నాకు. పదేపదే జోగారావ్ గుర్తుకువస్తున్నాడు నాకు. మా అమ్మాయి అంజు పుట్టినపుడు- భాగ్యం చాలా వీక్‌గా ఉండేది. దానితో ప్రీ-మెచ్యూర్ కాన్పు అయింది. డాక్టర్‌తో సహా అందరూ 'పిల్ల దక్కడం చాలాకష్టం!' అన్నారు. ఏమీ పాలుపోలేదు నాకు.

"దీంట్లో ఏముందిరా? కాళ్లూ, చేతులూ అన్నీ బాగున్నాయి. బేబీ ఆరోగ్యంగా ఉంది. ఓ నెలరోజులు ఇంక్యుబేటర్‌లో పెడితే సరి!" ఎప్పుడూ ఓ మంచిమాటతో ఆదుకొనే జోగారావు సలహాకు అప్పుడూ తల ఊపాను. వెంటనే చొరవ తీసుకొని సూళ్లూరుపేట నుండి దగ్గరలోని నాయుడుపేటకు తీసుకొచ్చి హాస్పిటల్‌లో అడ్మిట్ చేశాడు.

శిశువుకు రక్తం కావాల్సివస్తే తన రక్తాన్ని అందించి ప్రాణం కాపాడాడు. ఇంక్యుబేటర్ బేబీ ఆనాడు వాడి చలవతోనే బ్రతికి బట్ట కట్టగల్గింది. ఇప్పుడు అంజు- ఇద్దరు పిల్లలకు తల్లి.

నిజం చెప్పాలంటే... ఆనాడు నాకున్న అతికొద్దిమంది స్నేహితులలో జోగారావు అతిముఖ్యుడు. అదేమిటోఁ... ఎప్పుడూ వాడి నోటివాక్కు వేదవాక్కులా పనిచేసేది. మా ఆఫీసులో కొలీగ్స్ అందరికీ మంచి సలహాలు ఇచ్చి సహకరిస్తూ ఉండేవాడు. దానికితోడు జ్యోతిశ్శాస్త్రంలో కూడా కొంచెం ప్రవేశం ఉందనుకుంటా- చేయి చూసి, ముఖాన్ని పరిశీలించి మనుషుల భవిష్యత్తు గురించి ఏకరువు పెట్టేవాడు.

"చూడు శౌరీ... భవిష్యత్తు నీది! ప్రమోషన్స్ నిన్ను మంచి పొజిషన్‌కి తీసుకువెళతాయి!" అంటుంటే... "ఇది మాత్రం అంత తేలిక కాదులే!" అని కొట్టిపారేసేవాణ్ని.

వాడి నోటిలో పంచదార పొయ్య! తరువాతి సంవత్సరమే నాకు మేనేజర్‌గా ప్రమోషనూ, వెంటనే సంతనూతలపాడు బ్రాంచికి ట్రాన్స్‌ఫరూ వచ్చాయి.

"వరంగల్ వదిలిన ట్రెయిన్ కాజీపేట చేరేలోపల ఇన్ని హాల్టులా?" ప్రక్క సీటులోని వ్యక్తి తనలో తాను గొణుక్కుంటున్నాడు.

నా దృష్టి అటు మళ్లింది. అవును... రైలు ఆగిపోయి ఉంది. ఇంతవరకూ నా కళ్ళముందు వెనక్కి పరుగులు తీసిన చెట్లూ, చేమలూ నిశ్చలంగా ఉన్నాయి... నా ఊహల విన్యాసంలా.

పేపర్‌వాలా వచ్చేసరికి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కొన్నాను. ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ లాగానే వార్తల ఎక్స్‌ప్రెస్ కూడా స్తబ్దుగా ఉంది, సెన్సేషనల్ న్యూస్ ఏమీ లేదు. నా మనసంతా అదోలా ఉంది.

"ఒరేయ్ శౌరీ! నా మాట మీద గురి ఉంది కాబట్టి చెప్పగల్గుతున్నాను. నీ భవిష్యత్తు ఆనందమయంగా ఉంటుంది. చక్కని సంసారం, సంతానం! పోతే... నువ్వు సర్వీసులో ఉండగా నీకంటూ ఓ ఇంటిని ఏర్పరచుకోలేవు. కానీ, రిటైరైపోయిన తరువాత మాత్రమే నీకు ఆ కల ఫలిస్తుంది. ఓ చక్కటి సౌధాన్ని నిర్మించుకుంటావ్. అది పదిమందికి ఉపయుక్తంగా ఉండాలని నా కోరిక. తద్వారా ఎందరికో మా బాలశౌరి స్ఫూర్తి కావాలి!"

ఆ మాటలు మొదట్లో నాకు అర్థంకాలేదు.

"అదేరా... నువ్వు చేయబోయే ఆ మంచిపని వెనుక ఓ ఉన్నతమైన సదాశయం ఉండాలని నా కోరిక!"

తేలిగ్గా నవ్వేశాను. మేనేజర్ అయ్యానన్న డాబు అప్పుడే నాలో కన్పిస్తోంది. కొత్త సర్కిల్‌లోకి ప్రవేశించేసరికి పాత పరిచయాలు పలచబడిపోవడం యాధృచ్ఛికమైంది.

అసలు స్నేహం నిలుపుకుంటేనే కదా- అది నిలబడేది! సంతనూతలపాడు బ్రాంచికి మేనేజర్‌గా వచ్చిన తరువాత కొత్త ఎసైన్‌మెంట్, కొత్త మనుషులు! అప్పుడప్పుడు ఏదో ఫోన్ చేసి పలకరించేవాడిని తప్ప- క్రమంగా నాలో జోగారావు పట్ల స్నేహోత్సాహం పలచబడసాగింది.

కానీ, "తప్పనిసరిగా పదిమందికి ఉపయోగపడే ఓ నిర్మాణం చేపడతావు. అది నీ జాతకంలో ఉంది. దానివెనుక ఓ పరోపకారం, ఓ మానవసేవ మిళితమై ఉంటాయి!" అన్న వాడి మాటలు, పాతిక సంవత్సరాలు దాటినా- నా చెవుల్లో మారుమ్రోగుతూనే ఉన్నాయి.

అప్పుడు అన్నట్లుగానే నాది ట్రాన్స్‌ఫరబుల్ జాబ్ కావడంతో, ఒకచోట స్థిరత్వం లేక ఇల్లు కట్టే ఆలోచన చేయలేకపోయాను. ఇన్నాళ్లూ సర్వీసులో ఉండి రోజులు వెలగబెట్టినా, నాలో ఏదో అసంతృప్తి! కొడుకును బాగానే చదివించి ప్రయోజకుణ్ని చేశాను. కూతుర్ని పైచదువులు చదివాక ఓ అయ్య చేతిలో పెట్టాను. నా కంటిదీపాలు రెండూ- వారి పిల్లాపాపలతో దేదీప్యంగా వెలుగుతున్నాయి.

మనిషిగా ఇంక నాకు కావాల్సినదేముంది? ఒకరి ఎదుట చేయి చాచకుండా గౌరవంగా, ఉన్నతంగానే రిటైరైపోయాను. పదిమంది చేతా 'బాలశౌరి నిప్పులాంటి మనిషి' అనిపించుకోగలిగాను.

అయినా... ఏదో కొరవ నన్ను నిలదీస్తూనే ఉంది. మాటల కతీతమైన భావనేదో నిరంతరం నా మనసుని తొలిచేస్తూనే ఉంది.

"చిన్నపిల్లలు- వాళ్ళు అలాగే అంటారు. మీరు మాత్రం ఆ శిర్డీ సాయినాథుని మందిరాన్ని కట్టించి తీరాల్సిందే! ఆ స్వామి మన ఇష్టదైవం!" భాగ్యం నా చెవుల్లో జోరీగలా పోరుతోంది.

ఎవరి ఉద్దేశాలు, ఎవరి అభిప్రాయాలు వారివి! అసలు ఇన్నాళ్లూ పిల్లల దగ్గర ఎప్పుడూ ఉండలేదు. ఈమధ్యనే రిటైరైపోయాను కాబట్టి బాబి, అంజు పట్టుపట్టడంతో- కొన్నాళ్లు వరంగల్‌కి బయలుదేరక తప్పలేదు. చెప్పకపోవడమేం... నా కోడలూ మంచిది. అల్లుడూ మంచివాడే! "మావయ్యా! మావయ్యా!" అంటూ నెత్తిమీద పెట్టుకున్నారు. ఇక మనవలైతే సరేసరి- 'తాతగార'ంటూ నన్ను విడిచిపెట్టేవారు కాదు.

మెల్లగా నా మనసులో దాచుకున్న ఉద్దేశాన్ని బయటపెట్టాను. పిల్లలు ఏమంటారోనని నాలో ఒకింత సంకోచంగా ఉంది. రిటైర్‌మెంట్ అయిన తరువాత నాకు వచ్చిన పదిహేను లక్షల రూపాయలు ఏదోవిధంగా సద్వినియోగపడాలని నా ఉద్దేశం. దానికి ఆనాడు జోగారావు చెప్పిన సలహా మంచిగా అన్పిస్తోంది.

"బెస్ట్ ఐడియా డాడీ! ఆ డబ్బు ఒక కట్టడానికి ఇన్‌వెస్ట్ చేయాలనుకున్నారు కాబట్టి మంచి సెంటర్ చూసుకొని నేషనల్ హైవే మీద గోడౌన్స్ కట్టండి. మిగిలిన సొమ్ములకి బ్యాంక్ లోన్ అప్లయ్ చేద్దాం. నేను, మా డిపార్టుమెంట్ ద్వారా ఆ గోడౌన్స్ లీజుకు తీసుకొనే ఏర్పాటు చేయిస్తాను. అప్పుడు రెండు విధాలా లాభమే!" బాబి మాటలు బాగానే ఉన్నాయి.

"మనం ఈనాడు ఇంత మంచిస్థితిలో ఉన్నామంటే ఆ సాయినాథుని కృప తప్ప ఇంకేమీ లేదు. మన ఊరిలో 'శిర్డీసాయి మందిరం నిర్మించాలి!" భాగ్యం ఉద్దేశాన్ని కూడా అందరూ హర్షించారు.

"అంకుల్! మా డాడీ సిన్మా డిస్ట్రిబ్యూటర్. మీరు కూడా బ్యాంక్‌లోన్ పెట్టి మంచి పోష్ సెంటర్‌లో ఏ.సి. థియేటర్‌కి ప్లాన్ చేయండి. పేరుకు పేరు, పరపతికి పరపతీను!" కోడలు తనకు తోచిన సలహా తాను పడేసింది.

"ఇవన్నీ అటుంచి మన ఊరిలోనే మంచి కళ్యాణమంటపం కట్టించి పడేయండి. అప్పుడు మన పొజిషన్ నిత్యకళ్యాణం- పచ్చతోరణంలా ఉంటుంది!" మా అమ్మాయి అంజు అభిప్రాయమది.

"పోనీ, షాపింగ్ కాంప్లెక్స్ ప్లాన్ చేసి షాప్స్ అద్దెకిస్తే సరి!" అల్లుడి సలహా కూడా సహేతుకంగా ఉంది.

"తాతా! స్కూలుకి బిల్డింగ్స్ కట్టించు. మా బడిని దాంట్లోకి మార్చేస్తాం!" ముద్దుగా పలికారు మనవలు. రైస్‌మిల్లు, హోటల్, లాడ్జి మొదలైన అంశాలెన్నో చర్చకు వచ్చాయి.

అవేమీ నాకు సంతృప్తి నీయలేదు.

"అసలు మావగారి మనసులో మాట బయటపెట్టనే లేదు!" కోడలు, అల్లుడూ నా ముఖంలోకి చూస్తూ అన్నారు.

"ఉద్యోగ జంఝాటంలో పడి ఇన్నాళ్లూ నాకంటూ ఉండటానికి ఓ సొంత గూడు..." సాగదీయబోయాను.

"మీకు మళ్లీ ఇల్లెందుకు నాన్నా? అన్నయ్యా, నేనూ, వరంగల్‌లో సొంత ఇళ్లు కట్టుకొని స్థిరపడ్డాం. మీరు ఎప్పటికైనా మా దగ్గరకు రావాల్సినవారే. అటువంటిది మీకంటూ ఎక్కడో ప్రత్యేకంగా... నాకు మాత్రం ఆ అవసరం కన్పించడం లేదు!" అమ్మాయి కచ్చితంగా చెప్పింది.

"అవును డాడీ! అంజు కరెక్ట్‌గా చెప్పింది. మీకు ఈ వయసులో ఎక్కడో మళ్లీ సొంత ఇల్లు ఏమిటి? నా ఇల్లు మీ ఇల్లు కాదా?" పిల్లల మాటలు నా పెద్దరికాన్ని నిలబెడుతూనే ఉంది.

అయినా నిలకడలేని మనసు అతలాకుతలంగా ఉంది. ఒక్కోసారి వచ్చిన సొమ్ముల్ని బ్యాంక్‌లో పడేసి 'కృష్ణా... రామా...' అంటూ కూర్చుంటే చాలదా! వచ్చే ఫించను భృతికి సరిపడదా?' అన్న ఆలోచన కలుగుతోంది. మనిషిగా మానవత్వంతో చేయాల్సినదేదో ఇంకా మిగిలి ఉందని అంతరంగం నొక్కిచెబుతోంది. జీవిత పరమార్థం కోసం ఏదో మంచి చేయాలన్న తపన నాలో. గుళ్లూ, గోపురాలూ, థియేటర్స్, కళ్యాణమంటపాలు, కాన్ఫరెన్స్ హాలు, షాపింగ్ కాంప్లెక్స్- ఇవేమీ రుచించడం లేదు నాకు.

ఈ రైలుప్రయాణం నా ఆలోచనా విహంగానికి తూగుటుయ్యాలలా ఉంది. రాళ్లనీ, రప్పల్నీ, వాగుల్నీ, వంకల్నీ దాటుకుంటూ చైతన్యం వైపు దూసుకుపోతోంది. బ్రిడ్జిల మీద పరుగెడుతూ, ఇప్పుడు చేస్తూన్న రోద వింతగానూ, ఆసక్తిగానూ అన్పిస్తోంది.

ఏమీ పాలుపోక చేతిలోని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేపరు వైపు దృష్టి మళ్లించాను.

"సాంబారు పౌడర్... రసం పౌడర్.. మసాలా పౌడర్... గులాబ్‌జామ్ పౌడర్... బాదంమిల్క్ పౌడర్... ఏదైనా సరే- ప్యాకెట్ టెన్ రూపీస్!" పాసింజర్స్‌ని నెమ్మదిగా అడుగుతున్నాడు ఆ ముసలాయన. సహజంగానే అతనివైపు ఒకసారి చూసి పేపర్‌లోకి దృష్టి పెట్టాను. ఇక భాగ్యానికి పనేముందీ... పిలిచి ప్యాకెట్స్‌ని పరిశీలిస్తోంది.

"తీసుకుంటే తీస్కో- లేకపోతే పంపేయ్. ఈమాత్రం ప్యాకెట్స్ మన ఊరిలో దొరకవా?" గట్టిగానే హెచ్చరించాను.

ఆ మనిషి వయసు డెబ్భై దాటి ఉండొచ్చు. ఒత్తైన జుట్టు, చిక్కటి జులపాల గెడ్డం, ఎండి లోతుకుపోయిన కళ్ళు, మాసిపోయిన బట్టలు, చేతిలో చిరుగుల సంచి... అసహ్యంగా ఉంది నాకు. మనిషి ఎలా ఉన్నా మాటతీరు తీరువుగానే ఉంది.

ఎక్కువగా అమ్ముడు పోలేదనుకుంటా... చేతిలోని చిరుగుల సంచిలో ప్యాకెట్స్ చాలానే కనబడుతున్నాయి. ఏడుకూ, ఎనిమిదికీ బేరం ఆడుతోంది భాగ్యం. ఎలాగైనా ఆడది కదూ!

అటువైపు నుండి ఓ ముసలామె పొట్లాలు అమ్మడానికి విశ్వప్రయత్నం చేస్తోంది. కొనమని అందర్నీ బతిమాలుతోంది. చేతులు, గడ్డం పట్టుకొనేంత పని చేస్తోంది.

"భాగ్యం! తీసుకుంటే తీస్కో లేకపోతే పంపేయ్!" మరోసారి హెచ్చరించాను.

"అలా అనకండి సార్! నాకోసం రకానికో ప్యాకెట్ తీసుకోండి. ఇట్స్ మై అబ్లిగేషన్!"

ఇక కాదనలేకపోయాను. భాగ్యం బేరం ఆడుతున్నా ఐదు ప్యాకెట్స్ తీసుకొని ఏభై నోటు చేతిలో పెట్టాను.

"హమ్మయ్య! ఇంకా డెబ్భై ఐదు ప్యాకెట్స్ అమ్మాలి!" లెక్కచూసుకుంటూ తనలో తానే అనుకుంటున్నాడు. విషయం అర్థంకాలేదు నాకు.

"ఏమేవ్‌... నువ్వెన్ని అమ్మావ్!?" వార్ధక్యం తెచ్చిన ఆయాసం నోట మాట రానీయడం లేదు. రైలు కుదుపుతో చేతిలో కఱ్ఱ చలిస్తోంది. శరీరం తూలుతోంది.

"ఈరోజు బేరాలు లేవయ్యా... పదికి మించి పోలా!" నాలుగు సీట్లు అవతల నుంచే అంటోంది ఆమె- లేని ఓపికను కూడదీసుకుంటూ.

నిస్త్రాణ అలుముకుందో, ఏమిటోः... నా ప్రక్కసీట్లో కూలబడ్డాడు అతను.

"సార్! ప్యాకెట్స్ వెంటనే బ్యాగ్‌లో పెట్టేయండి. రైల్వేవాళ్ళు వస్తే నన్నూ, నా సరుకునూ తీసుకుపోతారు!" కొంచెం భయంగా అన్నాడు.

ఏమీ అర్థంకావట్లేదు నాకు. మౌనంగా చూశాను.

"అదే సార్... ట్రైన్‌లో పర్మిషన్ లేకుండా ఇటువంటివి అమ్మకూడదు!"

"ప్యాకెట్‌కి నీకెంత లాభం ఉంటుంది?" ఒకింత ఉత్సాహంగానే అడిగాను.

"మూడు రూపాయలు! అయినా... ఎంత వచ్చినా వాళ్ళకి ఇవ్వాల్సిందేగా?" అంటున్న ఆ ముసలాడి కళ్ళలో నీళ్లు కమ్ముకుంటున్నాయి. మాట బరువెక్కినట్లుంది.

"ఇక అమ్మడం నావల్ల కాదు ముసలాయనో! ఈరోజు కోడలి చేతిలో మనకు అర్థాకలే!" చివుక్కుమంది నా మనసు.

"అదే బాబుగారూ! మేం ఈ సాంబారు పొట్లాలు అమ్మాల... వచ్చిన వందో, రెండొందలలో మా ఇంటికాడ ఇవ్వాల! అప్పుడే నా కన్నకొడుకూ, వాడు కట్టుకున్న కోడలూ మాకు ఇంత ముద్ద పడేసేది!" చెమటలు చీరచెంగుతో తుడుచుకుంటూ వణికిపోతోంది- భర్త ప్రక్కన కూలబడ్డ ఆ ముసలామె.

నా మనసు ఆర్ద్రతతో నిండిపోయింది. పాపం... ఈ జీవిత చరమాంకంలో వీళ్ళకెన్ని కష్టాలో?!

"వెనకాల మీకంటూ ఆధారం ఏమీ..." భాగ్యం సంభాషణ పొడిగించింది.

"లేకపోవడమేమిటమ్మా? మార్కెటింగ్ డిపార్టుమెంట్‌లో గుమాస్తాగిరీ వెలగబెట్టి రిటైరయ్యాడు ఈయనగారు. వచ్చిన డబ్బంతా 'కొడుకూ, కొడుకూ...' అంటూ వాడికి ధారపోశాడు. ఇప్పుడు వాడికి కన్నతల్లిదండ్రులే కఠినమైపోయారు. విచక్షణ లేకుండా సొమ్ము లాక్కొని, మమ్మల్ని బజారున పడేశాడు. ఈ వయసులో ఇలా చిల్లర వ్యాపారాలు చేసి సాయంత్రానికి రెండు, మూడు వందలు తెచ్చి ఇస్తేనే కోడలు మాకు ఇంత తిండి పడేసేది. లేకుంటే ఇంతే సంగతులు!!"

- చెప్పుకుపోతోంది ఆమె.

మలిసంధ్య మనిషిని ఎంత దైన్యస్థితికి దిగజారుస్తోంది?! మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ అట! నాదీ ఆ డిపార్టుమెంటే కావడంతో అతను పనిచేసిన ప్రాంతాలు, వ్యక్తుల వివరాలు, ఉత్సాహంతో సంభాషణ పొడిగించాను... "అరేః... నువ్వు జోగారావ్వి!"

పకపకా నవ్వుతున్నాడు 'అవు'నన్నట్లు. పాతిక సంవత్సరాల క్రితం పరిచయం! అందునా మా ఇద్దరికీ వయసు తేడా ఎక్కువ కావడంతో, అతను నాకన్నా చాలా ఎర్లీగా రిటైరైపోయాడు. గడ్డం మీసాల మధ్య ఆనాటి మిత్రుణ్ని సరిగా పోల్చుకోలేకపోయాను. చూపు మందగించినట్లుంది. పట్టిపట్టి ముఖంలోకి చూస్తున్నాడు. అతని భార్య కూడా నాకు చాలా గుర్తు. అదే రూపం. పోతే... వార్ధక్యం తెచ్చిన ముడుతలు ముఖంలో స్పష్టంగా అగుపిస్తున్నాయి.

"అరేः... జోగారావు అన్నగారూ! ఎన్నాళ్లకు ఎన్నాళ్లకు!" ఆనందంతో భాగ్యం నోట మాట రావడంలేదు. బ్యాగ్‌లోంచి కోడలు ఇచ్చిన పులిహోరా, జంతికలూ తీసి అందించింది. తిండికి ముఖం వాచినట్లుగా ఉంది... వద్దనకుండా ఆబగా తింటున్నారు. ఇచ్చిన మంచినీళ్లు గడగడా తాగేశారు.

మనసు మూగబోయింది నాకు. ఒకప్పటి జోగారావు. అందరికీ 'నేనున్నా'నంటూ పదిమందిలో ఒకే ఒక్కడుగా మసలిన జోగారావు! అతని మంచితనం, ఏదో ఆత్మీయతా పరిమళం నా వెన్ను తడుతోంది.

"ఒరేయ్ఁ... జోగా! సూళ్ళూరుపేట నుండి సంతనూతలపాడు బ్రాంచికి ప్రమోషన్ మీద ట్రాన్స్‌ఫర్ అయినప్పుడు నీవు ఒక మాట అన్నావు... గుర్తుందా?"

"ఏమన్నాను? ఏమో..?!" ముఖంలోకి తదేకంగా చూస్తున్నాడు. నా అరచేతిని అందుకొని మందగించిన చూపుతో పరిశీలనాత్మకంగా చూస్తున్నాడు.

"అవును. నీకు ఇప్పటివరకు స్థిరాస్తి యోగం లేదు. ఇప్పుడు రిటైరైపోయావ్. ఆ సమయం ఆసన్నమైంది!"

"దానిలో నీ మంచి మనసు. మానవ సేవ..."

"ఆ సలహా కూడా మీరే ఈయండి అన్నయ్యగారూ!" భాగ్యం అందుకొంది. ఇంతకాలం కొడుకూ, కూతుళ్ళతో సంప్రదించిన విషయం అంతా వివరంగా ఏకరువు పెడుతోంది.

"ఒరేయ్ఁ... జోగా! ఏం చేయాలో నువ్వే నిర్ణయించరా!"

ప్రాణస్నేహితుని నోట ఆ మంచిమాట కోసం ఆత్రుతగా ఎదురుచూస్తోంది నా అంతరంగం.

బోసినోటితో పకపకా నవ్వుతున్నాడు. ఎంతో హాయిగా ఉంది నాకు.

"శిర్డీ సాయి ఓల్డేజ్ హోమ్! మానవ సేవామందిరం... అది నీ పాలిటి శ్వేతసౌధం!" అతని నోట ఆ ముత్యాల మాట నచ్చిందనుకుంటా... భాగ్యం ముఖం కళకళలాడిపోతోంది.

"చాలా సంతోషం అన్నయ్యగారూ! ఆ సాయినాథుని పేరిట వృద్ధుల సేవాశ్రమం! ఇది మీరు అన్నట్లు మానవ సేవ కాదు- మాధవ సేవ!"

"ఈ వయసులో నీకు ఈ బాధలు చెల్లు! నీకూ, నాకూ, మనలాంటి మరెందరికో..!" అన్నాను ఆత్మీయంగా అతని చేతిని నొక్కుతూ.

ఇప్పుడు నా మనసు తేలికపడింది. చాలా ఆహ్లాదంగానూ, ఉత్తేజంగానూ ఉంది.

'శిర్డీసాయి వృద్ధుల సేవాశ్రమం!'

ఆ శ్వేతసౌధం అప్పుడే నా మస్తిష్కంలో ఊపిరి పోసుకుంటోంది. అక్కడ ఎంతోమంది జోగారావులు, అయినవారి ఆత్మీయతను పొందలేనివారు, వార్ధక్యం పేరుతో సంఘంలో వెలివేయబడ్డవారు.

నాకు మటుకు ఈ జీవితానికి ఆ పరమార్థం చాలనిపిస్తోంది. మా నిర్ణయాన్ని ప్రశంసిస్తోందనుకుంటా- ఓ చల్లని మేఘం నుండి జాలువారిన చిరుగాలి స్పర్శ మా మేనులను తాకి పులకింతకు గురిచేస్తోంది.

'ఆదివారం ఆంధ్రప్రభ' . . . *1 మే, 2005*